హైదరాబాద్ వార్త

నెహ్రూ జూలాజికల్ పార్కులో కనువిందు చేయనున్న జీబ్రాలు

చార్మినార్, అక్టోబరు 7 ప్రభాతవార్త : గుజరాత్‌లోని వంతరా పార్కు నుంచి ఇటీవల తీసుకు వచ్చిన మూడు జీబ్రాలను హైదరాబాద్ పాతబస్తీ బహదూర్ పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కు ఎన్‌క్లోజర్‌లోకి విడిచి పెట్టారు. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్‌వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్. సువర్ణ మూడు జీబ్రాలను ఎన్‌క్లోజర్‌లోకి వదిలారు. జంతు మార్పిడిలో భాగంగా గుజరాత్ లోని వతంరా జూపార్కు నుంచి ఒక మగ, రెండు ఆడ జీబ్రాలు కొద్ది రోజుల క్రితం నెహ్రూ జూలాజికల్ పార్కుకు వచ్చాయి. మూడు జీబ్రాలను పర్యవేక్షణ లో ఉంచిన అనంతరం జూపార్కులోని ఎన్‌క్లోజర్‌లోకి సోమవారం విడిచి పెట్టారు. కాగా జూ పార్కుకు చెందిన ఇరవై మూషిక జింకలను గుజరాత్‌లోని వంతరా జూపార్కుకు అందజేయనున్నారు. కాగా నూతనంగా నిర్మించిన సింభా క్యాంటిన్, ఎలుగు బంట్లు కోసం నిర్మించిన నైట్ హౌస్‌లను ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్‌వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్. సువర్ణ ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో పలువురు అటవీశాఖ అధికారులు, జూపార్కు అధికారులు, ఉద్యోగులు

జూపార్కులోని ఎన్‌క్లోజర్‌లోకి విడుదల చేసిన జీబ్రాలు

పాల్గొన్నారు. ముప్ఫై ఐదు సంవత్సరవాలుల తర్వాత జూపార్కుకు జీబ్రాలు వచ్చాయి.

ఎఫ్‌టిఎల్ ఎంత .. బఫర్ జోన్ ఎంతా ?

-ఓఆర్ఆర్ పరిధిలోని చెరువులపై హైడ్రా ఫోకస్

-ఒక్కో చెరువు సరిహద్దులను నిర్ణయించే పనిలో నిమగ్నం

-ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి మ్యాపింగ్

-హద్దులు పూర్తయ్యాక నెలాఖరులో ఫైనల్ నోటికికేషన్



హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త: నగరంలో ఎన్ని చెరువులున్నాయి.. అవి ఎక్కడెక్కడున్నాయి. ఏ చెరువు పరిధి ఎక్కడి వరకు ఉంది.. దాని ఎల్‌టిఎఫ్ ఎంత వరకు.. బఫర్ జోన్ ఏ మేరకు విస్తరించి ఉంది.. ఇవన్నీ ప్రస్తుతం నగర ప్రజల మదిలో ఉన్న సందేహాలు.. కొత్తగా ఇళ్లు కట్టుకోవాలన్నా.. ఓపెన్ ప్లాట్ కొనాలన్నా అది ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ లో ఉందా లేదా అనేది ఎలా తెలుసుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు నగరం జనం. దీంతో ఇలాంటివి వాటికి క్లారిటీ ఇచ్చేందుకు హైడ్రా సిద్ధమైంది. ప్రస్తుతం ఔటర్ పరిధిలో ఉన్న అన్ని చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ సరిహద్దులు నిర్ణయించే పనిలో ఉన్నారు అధికారులు. హైడ్రా, ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల సమన్వయంతో చెరువుల హద్దులు నిర్ణయిస్తున్నారు. గ్రేటర్ పరిధిలోని అన్ని చెరువుల హద్దులు ఫైనల్ చేసిన తర్వాత అన్ని చెరువుల వివరాలతో కూడిన ఫైనల్ నోటిఫికేషన్ రిలీజ్ చేయనున్నారు. ఔటర్ పరిధిలో ఎన్ని చెరువులున్నాయి.. ఏయే చెరువు ఎన్ని ఎకరాల మేర ఉంది.. దాని ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ ఎక్కడి వరకున్నాయి.. ఎంత మేరకు కబ్జాకు గురైందనే సమాచారం ఈ నోటిఫికేషన్ లో ఉండనుంది. దీంతో కొత్తగా ఇళ్లు కట్టుకోవాలన్నా, ప్లాట్లు కొనాలన్నా అవి ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ లో ఉన్నాయా లేవా అనే విషయాలు వెంటనే తెలుసుకునే అవకాశం ఉంటుంది. అలాగే రియల్టర్లు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ లో ఇండ్లు కట్టి మనకు అమ్మి కట్టబెట్టాలని చూసినా.. ఈ నోటిఫికేషన్ లోని వివరాల ద్వారా తెలుసుకోవచ్చు.

న్యాయ నిపుణులతో కలిసి..

ఇప్పటి వరకు చెరువులకు ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్ గుర్తించిన విధానం వల్ల చట్టపరమైన సమస్యలు, చెరువును రక్షించే అవకాశాలు తక్కువ గా ఉండటం వంటి లోపాలను హైడ్రా గుర్తించింది. దీంతో వేగంగా, చట్టపరిధిలో హద్దులను గుర్తించడంపై కమిషనర్ రంగనాథ్ దృష్టి పెట్టారు. సర్వే ఆఫ్ ఇండియా ట్రోపోషీట్లు, గ్రామ రెవెన్యూ పటాలు, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, తెలంగాణ రిమోట్ సెన్సింగ్ కేంద్రాల ఉపగ్రహ చిత్రాలను బేరీజు వేసి 1025 చెరువులు ఓఆర్ఆర్ లోపల ఉన్నట్టు లెక్క తేల్చారు. సర్వేచేసి క్షేత్రస్థాయి నివేదికలు తెప్పించుకుంటూ.. చెరువుల వారీగా వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ఉపగ్రహ చిత్రాల్లోని చెరువు విస్తీర్ణాన్ని తేల్చి, తుది నోటిఫికేషన్ ఇవ్వడంపై హైడ్రా కసరత్తు చేస్తోంది.

ఫైనల్ నోటిఫికేషన్‌లో డిజిటల్ మ్యాప్‌లు..

హైడ్రా రిలీజ్ చేయనున్న చెరువుల ఫైనల్ నోటిఫికేషన్ లో డిజిటల్ మ్యాప్స్ ఉండనున్నాయి.. చెరువు ఉన్న ప్రాంతాన్ని, అలుగు, తూములను మ్యాపింగ్ చేస్తున్నారు. దశలవా రీగా అన్ని చెరువులకు హద్దులను నిర్ణయిస్తామని అధికారులు తెలుపుతున్నారు. మేడ్చల్, దుండిగల్, దేవరయాంజల్, కొంపల్లి, శామీర్‌పేట్, గాజులరామారం, కుత్బుల్లా పూర్, పేట్‌బషీరాబాద్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి ప్రాంతాల్లోని చెరువుల హద్దులను గుర్తిస్తున్నామన్నారు. ప్రస్తుతం 35 నుంచి 40 చెరువులకు హద్దు లను నిర్ణయించామని వాటికి సంబంధించిన నోటిఫికేషన్లను ఈ నెలాఖరులో విడుదల చేస్తామంటున్నారు. 1975 నాటి సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్స్, 1950 నాటి విలేజ్ మ్యాపులు, రెవెన్యూ మ్యాప్స్, ఎన్ఆర్ఎస్ఏ శాటిలైట్ ఇమేజెస్‌ను పరిగణనలోకి తీసుకుని హద్దులు నిర్ణయిస్తున్నారు. ఇప్పటికే చెరువులకు సంబంధించిన సమాచారం హెచ్ఎండీఏ వద్ద ఉందని ప్రతీ చెరువు, కుంట, ట్యాంక్ కు ప్రత్యేక ఐడీ సైతం జారీ చేసిందన్నారు. ఈ వివరాలన్నీ హెచ్ఎండీఏ వెబ్సైట్ లో పొందుపరిచినా.. ఇది కేవలం ప్రైమరీ నోటిఫికేషన్‌లోనే ఉందని హద్దులు పూర్తయ్యాక అన్నింటికి ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని డ్రైవింగ్ చేస్తున్నారా..?

-అయితే ఊచలు లెక్కపెట్టాల్సిందే.. వాహనదారులకు సిపి సజ్జనార్ హెచ్చరిక

హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త: నగరంలో నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా అవతలి వారి నిరక్ష్యం కారణంగా కొన్ని సందర్భాల్లో ప్రమాదాల బారిన పడాల్సి వస్తుంది. కొందరి నిరక్ష్యం ఎందరో జీవితాలను నాశనం చేస్తుంది. డ్రైవింగ్ చేసే సమయంలో చాలా మంది నిరక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. వాహనం నడుపుతూ మొబైల్ మాట్లాడటం వంటివి చేస్తుంటారు. కొందరైతే చెవిలో ఇయర్ ఫోన్స్ పెట్టుకుని డ్రైవింగ్ చేస్తుంటారు. అలాంటి వారి వల్ల ప్రమాదాల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఈక్రమంలో సీపీ సజ్జనార్ వాహదారులకు వార్నింగ్ ఇచ్చారు. ఈమేరకు మంగళవారం ఎక్స్ వేదికగా ఒక పోస్ట్ చేశారు. ముఖ్యంగా బైక్ టాక్స్, క్యాబ్, ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ చేసేటప్పుడు హెడ్ సెట్, ఇయర్ ఫోన్స్ వంటివి వాడుతున్నారని ఇకపై ఇలాంటి వారిని చూస్తూ ఊరుకునేది లేదని వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్‌లో వీడియోలు చూడటం, ఇయర్‌ఫోన్లు వాడటం నేరమని తెలిపారు. డ్రైవింగ్ చేస్తూ ఇలాంటి చర్యలకు పాల్పడటం ప్రమాదకరమని వాహనాలు నడుపుతూ ఇలా నిరక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సజ్జనార్ స్పష్టం చేశారు. వాహనదారులకు స్వీయ రక్షణతో పాటు, ప్రయాణీకులు, తోటి రోడ్డు వినియోగదారుల భద్రత కూడా చాలా ముఖ్యమని సజ్జనార్ నొక్కి చెప్పారు. చిన్న పాటి పరధ్యానం కూడా ప్రాణాలకు హాని కలిగి స్తుందని కాబట్టి, డ్రైవింగ్ సమ యంలో ఇలాంటి వాటిపై దృష్టి పెట్టకుండా, సురక్షితంగా ఉండాలని సూ చించారు. కాగా కొన్ని సంవత్స రాల విరామం తర్వాత పోలీసు యూనిఫాం వేసుకున్న సజ్జనార్ తాజాగా హైదరాబాద్ పోలీస్ కమిష నర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టారు. తొలి రోజు నుంచే తనదైన మార్క్ చూపిస్తున్నారు. సీపీగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారికి కఠిన హెచ్చరికలు జారీ చేస్తూ వచ్చారు. తాజాగా.. డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో కూడా మందుబాబులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని.. ఈ నియమాన్ని ఉల్లంఘిస్తే జైల్లో ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

42 శాతం బిసి రిజర్వేషన్ల అమలు బాధ్యత ప్రభుత్వాలదే

- ప్రజా ఐక్య కూటమి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజా ఐక్య కూటమి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ, దాసు సురేశ్, చిరంజీవులు తదితరులు

చిక్కడపల్లి, అక్టోబరు 7 ప్రభాతవార్త: రిజర్వేషన్లు ఖరారు కానంతవరకు స్థానిక సంస్థల ఎలక్షన్లను వాయిదా వేయాలని డిమాండ్ చేసింది. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ప్రజా ఐక్య కూటమి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం కన్వీనర్ దాసుసురేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ తిరుగుబాటు దిశగా కొనసాగనున్న తదుపరి బీసీల ఉద్యమాలు అణిచివేతకు గురి చేస్తే చివరకు మిగిలేది విప్లవమేనని అన్నారు. బీసీ రేజర్వేషన్ల పెంపుకు ఆర్టికల్ 9 మాత్రమే శరణ్యమన్నారు. దాసు సురేశ్ మాట్లాడుతూ కోర్టు తీర్పు ఎలా ఉన్నా 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు బాధ్యత ప్రభుత్వాలదేనని, రిజర్వేషన్లు ఖరారు కానంతవరకు స్థానిక సంస్థల ఎలక్షన్లను వాయిదా వేయాలని మరో సారి డిమాండ్ చేశారు. పార్టీ పరమైన రిజర్వేషన్లు మాకు వద్దేవద్దని, రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు. అట్టడుగు వర్గాల ఆకాంక్షలను నెరవెర్చే దిశగా ప్రజా ఐక్య కూటమి కృషిఅన్ని బీసీ సంఘాలను ఉద్యమ సంస్థలను, కలిసి వచ్చే రాజకీయ పార్టీలను లక్ష్యం దిశగా ప్రజా ఐక్య కూటమి నడిపిస్తుందన్నారు. రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రిజర్వేషన్ల అమలుకు అండగా నిలబడకపోతే పార్టీలను అగ్రవర్ణ నాయకులను రాష్ట్రవ్యాప్తంగా స్తంభింప చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవులు ,మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు,బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ,ఏరుకొండ హైమావతి ,బీసీ రాజ్యాధికార సమితి ఆర్గనైజింగ్ సెక్రటరీ గండి వీరేందర్ గౌడ్, బిజెపి బీసి విభాగం అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మదత కిషోర్ ,గట్ల రాజన్న,వంగ రవి యాదవ్, మహిళా అధ్యక్షురాలు ఏరుకొండ హైమావతి, గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు బండారు పద్మావతి,సరస్వతి, బాయక్క, పద్మక్క,మంజుల, తాళ్ల భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మద్యం మత్తులో లిఫ్ట్ గుంతలో పడి వ్యక్తి మృతి

పేట్ బషీరాబాద్, అక్టోబర్ 7, ప్రభాతవార్త

మద్యం మత్తులో లిఫ్ట్ గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పూలపల్లి గ్రామం, దుర్గి మండలం, పల్నాడు జిల్లాకు చెందిన దేవరపు శ్రీను (38) రెండు సంవత్సరాల క్రితం హాస్టల్ వ్యాపారం నిమిత్తం హైదరాబాద్‌కు రావడం జరిగింది. మైసమ్మగూడలో సుమారు రెండు వారాల క్రితం కొత్త బిల్డింగ్‌ని తీసుకొని అందులో కె ఎస్ బాయ్స్ హాస్టల్ నిర్వహిస్తున్నాడు. సోమవారం కొంతమంది స్టూడెంట్స్‌కి రూములు చూపిస్తూ ప్రమాదవశాత్తు తాగిన మత్తులో కాలుజారి ఫస్ట్ ఫ్లోర్ నుండి లిఫ్ట్ గుంతలో పడిపోయాడు. వెంటనే అతన్ని ఎస్.వి. హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ రాత్రి సుమారు 9 గంటల సమయంలో మరణించాడు. అతని భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు "ఫిర్యాదు కమిటీ "

న-అడిషనల్ కమిషనర్ అధ్యక్షతన ముగ్గురు సభ్యులతో కమిటీ

-జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్

హైదరాబాద్, అక్టోబర్ 7, ప్రభాతవార్త:

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల నేపథ్యంలో జిల్లా ఫిర్యాదు కమిటీనీ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ నగదు సీజ్ చేయడం, రిలీజ్ చేయడం బృందాలకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ జారీనీ కమిటి చూస్తుందన్నారు. ఎన్నిక నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమాలు అమలులో ఉన్నందున ఎన్నికల కాలంలో హైదరాబాద్ జిల్లా పరిధిలో ప్రయాణం చేసే పౌరులు పరిమిత మొత్తంలో నగదు లేదా విలువైన వస్తువులు మాత్రమే తీసుకెళ్లాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు. నగరంలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్,స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ నిరంతరం తనిఖీలు చేపడతాయని, అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకుంటాయని తెలిపారు. నగదుకు సంబంధించి సరైన ఆధారాలు చూపకపోతే చర్యలు తీసుకుంటామని నగదు జప్తుకు సంబంధించి జిల్లా ఫిర్యాదుల కమిటీకి తగిన ఆధారాలు పౌరులు చూపితే సభ్యులు ఎన్నికల నిబంధనల మేరకు పరిశీలించి జప్తు చేసిన నగదును తిరిగి అందజేస్తారు. జిల్లా ఫిర్యాదుల కమిటీ కార్యాలయం జీహెచ్ ఎంసీ హెడ్ ఆఫీస్ (3వ అంతస్తు, ట్యాంక్ బండ్, హైదరాబాద్) లోనీ అదనపు కమిషనర్ (ఇస్టేట్స్) ఛాంబర్ లోఉంటుందన్నారు. ఫిర్యాదారులు, పౌరులు ఈ కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ తెలిపారు.

జిల్లా ఫిర్యాదు కమిటీ ముగ్గురు సభ్యుల వివరాలు

1. కె.ఏ. మంగతాయారు (జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్) కమిటీ చైర్మన్ 9177608271
2. ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి ,చీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్, ఎలక్షన్ ఎక్స్పెండిచర్ మానిటరింగ్ నోడల్ ఆఫీసర్9121240116
3. వసుందర ,డిప్యూటీ డైరెక్టర్, డిటిఓ, హైదరాబాద్ ,9849044893

47వ ఆల్ ఇండియా రైల్వే కబడ్డీ ఛాంపియన్‌షిప్ ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న అదనపు జీఎం సత్యప్రకాష్ తధితరులు

తార్నాక, అక్టోబర్ 7 ప్రభాతవార్త :

రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్ (ఆర్.ఎస్.పి.బి) ఆధ్వర్యంలో మంగళవారం దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ 47వ ఆల్ ఇండియా రైల్వే కబడ్డీ (మహిళలు) ఛాంపియన్‌షిప్ పోటీలను ఈ నెల 7 నుండి 10 అక్టోబర్ వరకు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్ మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్, దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఫైనాన్షియల్ అడ్వైజర్ మరియు చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్,స్టోర్స్ వర్క్‌షాప్ పి. కోటేశ్వర రావు ఇతర సీనియర్ రైల్వే అధికారులు మరియు క్రీడా సిబ్బంది సమక్షంలో ప్రారంభించారు. ఈ సంవత్సరం సౌత్ ఈస్టర్న్ రైల్వే, ఈస్టర్న్ రైల్వే, వెస్ట్రన్ రైల్వే, సెంట్రల్ రైల్వే, ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, నార్త్ ఈస్టర్న్ రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే మరియు ఆతిథ్య వహిస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వేలకు సంబందించిన మొత్తం తొమ్మిది జట్లు ఈ పోటీలో పాల్గొంటున్నాయి. ఈ టోర్నమెంట్‌లో అంతర్జాతీయ మరియు జాతీయ స్థాయి ఆటగాళ్ళు పాల్గొంటారు. ఇది పోటీ యొక్క ఉన్నత ప్రమాణాలను మరియు క్రీడా నైపుణ్యాన్ని హామీ ఇస్తుంది. తొలి నాకౌట్ ప్రారంభ మ్యాచ్ దక్షిణ మధ్య రైల్వే,నార్త్ ఈస్టర్న్ రైల్వే మధ్య జరిగింది. ఈ మ్యాచ్ లో దక్షిణ మధ్య రైల్వే 48 పాయింట్లు సాధించి విజేతగా నిలువగా నార్త్ ఈస్టర్న్ రైల్వే 25 పాయింట్లు సాధించింది. ఈ సందర్భంగా అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్ మాట్లాడుతూ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే జట్లకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ ఫలితాలను సాధించడానికి నిజమైన క్రీడా స్ఫూర్తి, నిబద్ధత మరియు కృషిని ప్రదర్శించాలని ఆయన పాల్గొనేవారిని ప్రోత్సహించారు.

ఆదివాసీ పోరాటయోధుడు కుమరంభీం : మంత్రి సీతక్క

-ఆదివాసీ హక్కులకై పోరాడతాం

-తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



కుమరం భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

ముషీరాబాద్, అక్టోబర్ 7, ప్రభాతవార్త: ఆదివాసీ పోరాటయోధుడు కుమరం భీం అని తెలంగాణ పంచాయతీరాజ్‌శాఖా మంత్రి సీతక్క కొనియాడారు. మంగళవారం కుమరంభీం 85వ వర్ధంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై నున్న ఆయన విగ్రహం వద్ద గిరిజన ఐక్యవేదిక, ఆదివాసి తోటి సేవా సంఘంల సంయుక్త ఆధ్వర్యంలో కుమరంభీం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మంత్రి సీతక్క, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కుమరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ జీవో నెంబర్ 286ను అమలులోకి తీసుకువచ్చి, కుమరం భీం వర్ధంతిని రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ట్రైబల్‌వెల్‌ఫేర్ శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు ధన్యవాదములు తెలియచేస్తున్నామన్నారు. మా ఊళ్లో మారాజ్యం కావాలని కుమరంభీం చేసిన పోరాటం ఆత్మగౌరవ పోరాటం అని, మా అడవి మీద, మా నీళ్ల మీద, మా భూమి మీద మాకే హక్కు ఉండాలని ఆయన చేసిన పోరాట ఫలితంగానే ఆదివాసీయుల కోసం రాజ్యాంగంలో ప్రత్యేక జీవోలు, ప్రత్యేక హక్కులు కల్పించబడ్డాయని గుర్తు చేశారు. వెనుకబడిన గిరిజన ప్రాంతాలకు ట్రైబల్ వెల్ఫేర్ ద్వారా అత్యధిక నిధులు కేటాయింపచేసుకుని, అభివృద్ధి పథంలోకి తీసుకురావటమే కుమరం భీం కు మనమిచ్చే నిజమైన నివాళన్నారు. కుమరంభీం ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం గిరిజన ప్రాంతాలలో 22వేల ఇళ్లు కేటాయించారని అన్నారు. కుమరంభీం స్ఫూర్తితోనే నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెలంగాణ ఉద్యమం కొనసాగిందని గుర్తు చేశారు. కవిత మాట్లాడుతూ కొంతమంది జననం చరిత్ర అయితే, కొంతమంది మరణం చరిత్ర అవుతుందని, కుమరం భీం తన మరణంతో ఆదివాసీలకు ఎన్నో హక్కులను సాధించి పెట్టారని గుర్తు చేశారు. జల్, జంగిల్, జమీన్‌లపై ఆదివాసీలకే హక్కులు ఉండాలని ఆయన పోరాడారని, ఆయన చేసిన పోరాటం దేశం మొత్తం తరతరాలుగా చెప్పుకునే గొప్ప పోరాటమని కొనియాడారు. గుస్సాడి ఉత్సవాలకోసం గత ప్రభుత్వం ప్రతి సంవత్సరం 25వేలు ఇచ్చేదని, అదే విధంగా పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఉత్సవాలకు 50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక, గూడెలలో అభివృద్ధి ఆగిపోయిందని, మహళలకు కనీసం ప్రసూతతి సౌకర్యాలు లేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీల హక్కుల కోసం, ఆదివాసీలతో చర్చించి, త్వరలోనే పోరాట కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఐక్య వేదిక నాయకులు వివేక్ నాయక్, ఆదివాసీ జాగృఇ అధ్యక్షులు లోకిని రాజు, తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.రూప్‌సింగ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయ్

-ఎంపి రఘునందన్‌రావు

ఎర్రగడ్డలో ముస్లిం స్మశనవాటికకు స్థలం కేటాయించవద్దంటూ ధర్నాకు దిగిన ఎంపీ రఘునందన్‌రావు.

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 7, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఒక వర్గం ఓట్లను ఉప ఎన్నికల్లో ఉపయోగించుకునేందుకే కాంగ్రెస్ పార్టీ రాత్రికి రాత్రే జీవోను తీసుకొచ్చి ముస్లిం గ్రేవ్ యార్డ్‌కు స్థలం కేటాయించే ప్రయత్నం చేశారని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఇటీవల జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన ముస్లింలంతా తమకు గ్రేవ్ యార్డ్ స్థలం ఇస్తేనే ఆ పార్టీకి ఓట్లు వేస్తామంటూ బహిర్గతంగా వెల్లడించడంతో కాంగ్రెస్ మంత్రులు వక్ఫ్‌బోర్డ్ స్థలం అంటూ ఎర్రగడ్డలోని కోహినూరు ఫ్యాక్టరీకి చెందిన దాదాపు 2,500 గజాల స్థలాన్ని కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కొందరు ప్రైవేట్ వ్యక్తులు అక్కడికి వెళ్లి రాత్రికి రాత్రే ప్రహరీ గోడలను తొలగించారు. ఈ విషయాన్ని స్థానికంగా ఉండే బ్రిగేడ్, కలపతరు, జనప్రియా ప్లాట్ల ఓనర్లు బీజేపీ ఎంపీ దృష్టికి తీసుకు వెళ్లగా వెంటనే ఆయన స్పందించి పెద్దఎత్తున బీజేపీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అదేవిధంగా ఆయా అపార్ట్‌మెంట్లకు చెందిన ఓనర్లు నివాసాల మధ్య గ్రేవ్ యార్డ్ ఏర్పాటు చేయవద్దంటూ ప్లకార్డులతో నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొనడంతో బాలానగర్ ఏసీపీ, సనత్‌నగర్ సీఐ భారీగా పోలీసులను మోహరించారు. అక్కడికి వెళ్లకుండా నిరసనకారులతో పాటు ఎంపీ రఘునందన్‌ను, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు లంకల దీపక్‌రెడ్డిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జూటూరు కీర్తిరెడ్డిని, వీరపనేని పద్మలను అడ్డుకున్నారు. ఇక్కడి ప్రజలకు న్యాయం జరిగే వరకు ఊరుకునేది లేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఒక వర్గానికి మద్దతు తెలిపితే మిగతా వారంతా ఏకమై మీకు బుద్ధిచెబుతరాని పేర్కొన్నారు. సర్వే నెంబర్ 78, 79లో బ్రిగేడ్ అపార్ట్ మెంట్ నిర్మించుకోగా అందులో 1334 మంది నివాసితులు ఉన్నారు. కల్పతరువు అపార్ట్‌మెంట్‌లో 500 మంది కుటుంబాలు ఉన్నారు. వాసవి బృందావనంలో 380 ప్లాట్లు ఉన్నాయి. జనప్రియ అపార్ట్‌మెంట్‌లో 1400 ప్లాట్లు ఉన్నాయి. వీరందరికీ అభ్యంతరకరంగా ఉండే ఈ సమస్యను న్యాయపరంగానే పోరాడి అక్కడ ప్రజలకు ఇబ్బందిలేకుండా చూస్తామని ఎంపీ హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో చేకూరి హనుమంతునాయుడు, ప్రేమ్‌కుమార్, సుప్రియాగౌడ్, కృష్ణమోహన్, పులిరామ్ పాల్గొన్నారు.

9న డ్యూయల్ డిగ్రీ కోర్సుల ప్రవేశానికి కౌన్సిలింగ్

-పిజెటిఎయూ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్

అత్తాపూర్ అక్టోబరు7,ప్రభాతవార్త :

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీలు సంయుక్తంగా అందిస్తున్న డ్యూయల్ డిగ్రీ బిఎస్‌సీ (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశం కోసం ఈనెల 9వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు వాక్ ఇన్ కౌన్సిలింగ్‌ను నిర్వహిస్తున్నట్లు పిజెటిఎయూ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. అదేరోజు అనగా అక్టోబర్ 9వ తేదీ (గురువారం) మధ్యాహ్నం రెండు గంటలకు ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ ప్రాయోజిత కోటా బిఎస్‌సీ (ఆనర్స్) అగ్రికల్చర్, బిటెక్ (ఫుడ్ టెక్నాలజీ), బి.టెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్), తీళీది (ఆనర్స్), కమ్యూనిటీ సైన్స్ కోర్సుల్లో సీట్ల భర్తీకి వాక్ ఇన్ కౌన్సిలింగ్ జరగనుందని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఈ రెండు కౌన్సిలింగ్ లు రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ విభాగ కేంద్రంలో నిర్వహించనున్నట్లు విద్యాసాగర్ వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు, వెబ్ సైట్ లో పేర్కొన్న రుసుముతో కౌన్సిలింగ్ కు హాజరుకావాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ లో చూడవచ్చని రిజిస్ట్రార్ డాక్టర్ తెలిపారు.

రాజాను పరామర్శించిన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

రాజాను పరామర్శిస్తున్న బండారు దత్తాత్రేయ

హైదరాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త: బిజెపి సీనియర్ నాయకుడు అంబర్‌పేట దేవస్థాన్ సేవా సమితి ఉపాధ్యక్షులు రంగంపల్లి రాజాను హర్యానా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పరామర్శించారు. ఇటీవల రాజా ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుకున్న దత్తాత్రేయ మంగళవారం ఆయన ఇంటికి వచ్చి ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన దత్తాత్రేయకు 'ప్రజల ఆత్మకథే నా ఆత్మకథ' అనే పుస్తకాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రాజా కుటుంబ సభ్యులు దత్తాత్రేయను శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్, సి.కృష్ణాగౌడ్, అచ్చని రమేష్, గోవర్ధన్‌రెడ్డి, చుక్క జగన్, ఆర్.దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాచుపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డిసిపి సురేష్ కుమార్



రికార్డును పరిశీలిస్తున్న దృశ్యం

బాచుపల్లి, అక్టోబర్ 7, ప్రభాతవార్త

బాచుపల్లి పోలీస్ స్టేషన్‌ను మంగళవారం బాలానగర్ జోన్ డిసిపి కే సురేష్ కుమార్ ఐపిఎస్ సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ ప్రాంగణం మొత్తం పరిశీలించారు. ప్రభుత్వ ఆస్తులు, నేర ఆస్తులు, స్టేషన్ రికార్డులు, వివిధ కేసుల ఫైళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పిటిషనర్లతో సంభాషించి వారి అభిప్రాయాలను స్వీకరించారు. అనంతరం ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను పరిశీలించి సిబ్బందితో సంభాషించారు. పోలీసుల సంక్షేమం, భత్యాలను సమీక్షి ంచారు. ఈ కార్యక్రమంలో ఏసిపి. రవికిరణ్ రెడ్డి, బాచుపల్లి ఎస్‌హెచ్‌ఓ సతీష్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్లు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

వేధింపులు,వివక్షల వంటి సమస్యలపై చైతన్యం కల్గి ఉండాలి

-మహిళా కమిషన్ కార్యదర్శి పద్మజ రమణ

మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ కార్యదర్శి పద్మజ రమణ.

బేగంపేట అక్టోబరు 7,ప్రభాతవార్త

సమాజంలో మహిళలు,బాలికలు ఎదుర్కొంటున్న వివిధ సామాజిక దురాచారాలు,వేధింపులు,వివక్షలు వంటి సమస్యలపై చైతన్యం కలిగి ఉండాలని మహిళా కమీషన్ కార్యదర్శి పద్మజ రమణ అన్నారు.తెలంగాణా రాష్ట్ర మహిళా కమీషన్ ఛైర్ పర్సన్ నేరెళ్ల శారద ఆదేశానుసారం మహిళా కమీషన్ ఆధ్వర్యంలో సామాజిక దురాచారాలపై పోరాటం అనే అంశంపై గోల్కొండలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళా కమీషన్ కార్యదర్శి పద్మజ రమణ మాట్లాడుతూ మహిళలు తమ హక్కులను తెల్సుకుని ధైర్యంగా ముందుకు రావాలని ,సామాజిక దురాచారాలు అయిన బాల్య వివాహాలు,వరకట్న వేధింపులు,బాలకార్మికులు,వాటిని అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో మహిళా భద్రతా విభాగం, షీటీమ్ పోలీసులు గృహహింస,ఈవ్ టీజింగ్ మహిళలపై వేధింపుల వంటి సామాజిక సమస్యలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చట్టపరమైన మార్గాల గురించి పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు,మహిళలు,బాలికలు,మహిళా భద్రతా విభాగం షీటీమ్ అధికారులు సీడీపీఓ. రేణుక,ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ,మహిళా కమీషన్ అధికారులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి న్యాయవ్యవస్థపై దాడే

ప్రసంగిస్తున్న బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్

చిక్కడపల్లి, అక్టోబరు 7 ప్రభాతవార్త: ఢిల్లీలోని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గావాయ్ పై దాడికి యత్నించిన రాకేష్ కిషోర్ అనే న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని బహుజన లెఫ్ట్ పార్టీ బిఎల్‌పి(బహుజన కమ్యూనిస్టు) రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని బిఎల్‌పి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా నిర్మితమైన అత్యున్నత న్యాయవ్యవస్థపై దాడి చేయడమంటే భారత రాజ్యాంగంపై ప్రజాస్వామ్యంపై ఫాసిస్టు దాడిగా భావించాలని బహుజన లెఫ్ట్ పార్టీబిఎల్ పి(బహుజన కమ్యూనిస్టు) రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ తెలిపారు. జస్టిస్ బి.ఆర్.గావాయ్ పై జరిగిన దాడికి వందలాది మంది న్యాయవాదులే సాక్షంగా భావించి దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్ న్యాయవాద పట్టాను వెంటనే రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దేశాభివృద్ధికి శాశ్వత పరిష్కారం విద్యార్థిని, విద్యార్థులే

హ్యూమన్ రైట్స్ పిడబ్ల్యూఐఓ వ్యవస్థాపకుడు మాధవాచారి

సైఫాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త:

దేశాభివృద్ధికి శాశ్వత పరిష్కారం విద్యార్థిని, విద్యార్థులే నని తరగతి గదియే దేశ భవిష్యత్తు, దేశంలో అటెండర్ స్థాయి నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తి వరకు తరగతి గది నుంచి వచ్చినవారేనని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్ట్ అండ్ వెల్ఫేర్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొట్టిముక్కల మాధవాచారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్గనైజేషన్‌కు రాష్ట్ర సభ్యురాలిగా, మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షురాలిగా అమ్మనగంటి సుగుణారెడ్డిని నియమించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థినీ, విద్యార్థులలో నీతి, నిజాయితీ, ధర్మం, మానవత్వం, సంస్కారం, దయ, జాలి, కరుణ, ప్రేమ, స్త్రీల పట్ల గౌరవం, మానవత్వంతో కూడిన విద్యను అవలంభన చేసుకోవాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులను మొదటి దైవంగా, గురువులను రెండో దైవంగా, ఆ

సుగుణారెడ్డికి నియామక పత్రాన్ని అందజేస్తున్న గొట్టిముక్కల మాధవాచారి

తరువాతనే భగవంతుని స్థానమని ఆయన తెలిపారు. దేశంలో నేడు నైతిక విలువలకు, మానవత్వానికి తావు లేకుండా పోయిందని, ప్రతి మనిషి వారి, వారి స్థాయికి తగ్గట్టుగా హక్కులపై అవగాహన కలిగియుండాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అర్గనైజేషన్ కోశాధికారి బైరి మాధవి, తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం వైస్-ప్రెసిడెంట్ ఎర్ర బాను, నాయకులు ప్రేమలత, హరిప్రసాద్, మురళి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జిహెచ్ నెంబరు 9ని కాపాడుకోవడానికి కోర్టులో ఇంప్లీడ్ అవుతున్నాం

బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ

సైఫాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త: బిసిలకు కేటాయించిన 42 శాతం రిజర్వేషన్‌ల పరిరక్షణ కోసం జిహెచ్ నెంబరు 9ని కాపాడుకోవడానికి సంబంధించిన పిటిషన్లలో తాము కూడా ఇంప్లీడ్ అవుతున్నామని తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ చెప్పారు. రాష్ట్ర గవర్నర్ ప్రొసిజర్, మెరిట్‌పై వచ్చిన అంశంపై గత నెల 30వ తేదీలోగా ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్ ఇచ్చామనే వాదనను తాము పూర్తిగా సమర్థిస్తున్నామని ఆయన తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ మెరిట్ అంశంలో తాను బిసి రిజర్వేషన్‌ల పెంపు సాధనకై వేసిన ఫిటిషన్ ద్వారా వచ్చిన తీర్పు ఆధారంగా జరిగిన కుల గణన, అదే విధంగా మరో తీర్పు ద్వారా వచ్చిన ఎంటోడేడ్ కమిషన్ నియామక ప్రక్రియ ద్వారా వచ్చిన రిజర్వేషన్ల పెంపుకు అనుగుణ నివేదిక

సమావేశంలో మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

తద్వారా వచ్చిన జిహెచ్ నెంబర్‌గా పరిగణించాలనే వాదనకు అవసరమైన న్యాయ పూర్తి ప్రక్రియ చేయమని కోరామని తెలిపారు. బిసిల రిజర్వేషన్‌లలో రాజకీయ పార్టీలు అవలంబిస్తున్న ద్వంద్వ వైఖరిలను ఎండగడతామని, ఒక పార్టీ కేంద్ర విధానాలకు మాత్రమే కట్టుబడి ఉంటామని షెడ్యూల్ 9లో చేర్చే ప్రక్రియకు మద్దతు ఇవ్వకుండా కేంద్ర హోం శాఖ ద్వారా రాజ్యాంగ వ్యవస్థలను ప్రభావితం చేస్తున్న అంశాన్ని మరో పార్టీ రిజర్వేషన్లకు వ్యతిరేక పిటిషన్లను వేయిస్తున్న విషయాన్ని ప్రభుత్వ చిత్తశుద్ధి లోపంపై సమగ్ర అవగాహనను బహుజన లోకానికి తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రత్యేక రైలులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల యాత్ర

హైదరాబాద్, అక్టోబర్ 7, ప్రభాతవార్త:

ప్రత్యేక రైలులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల యాత్ర ఈ నవంబర్లో ప్రారంభించనున్నామని భారతీయ రైల్వేస్ భారత్ గౌరవ ట్రైన్, సౌత్ స్టార్ రైల్ డైరెక్టర్ విఘ్నేష్ తెలిపారు. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రత్యేక పర్యాటక రైలులో తమిళనాడు, కేరళలో ఉన్న దేవాలయాలు, పంచ ద్వారక, మహాదేవ్, జ్యోతిర్లింగాలు దర్శించుకునే అవకాశం కలదన్నారు. ఈ యాత్రలో ఒక యాత్ర నవంబర్ 16వ తేదీన, ఇంకో యాత్ర 26వ తేదీన ప్రారంభం కానుందన్నారు. ఇండియన్ రైల్వే, మొదటి భారత్ గౌరవ్ రైలు, సౌత్ స్టార్ రైల్, అతిపెద్ద టూరిస్ట్ రైలు ఆపరేటర్ టూర్ టైమ్స్ ఈ యాత్ర చేపట్టిందన్నారు. ఈ ప్రత్యేక పర్యాటక రైలు ఐఆర్సీటీసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో లేదన్నారు. రిజర్వేషన్ల కోసం టూర్ టైమ్స్‌ను నేరుగా 93550 21516 నెంబర్లో సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లో కూడా బుక్ చేసుకోవచ్చున్నారు. తమిళనాడు, కేరళ దేవాలయాల యాత్ర నవంబర్ 16వ తేదీన ప్రారంభం అవుతుందన్నారు. ఈ యాత్రలో తిరుకడైయూర్, చిదంబరం, అరుణాచలం, తిరుచ్చి, తంజావూరు, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, తిరువనం

సమావేశంలో మాట్లాడుతున్న విఘ్నేష్ తదితరులు

తపురం, చొట్టనిక్కర, గురువాయూర్ కలవన్నారు. ప్రదోషం నాడు చిదంబర నటరాజుని దర్శనం, మాస శివరాత్రి నాడు అరుణాచల శివుని దర్శనం, అమావాస్య నాడు కావేరి నది ఒడ్డున పిండ తర్పణం చేసుకోవచ్చున్నారు. పంచ ద్వారక, మహాదేవ్, జ్యోతిర్లింగాల యాత్ర నవంబర్ 26వ తేదీన ప్రారంభం కానుందన్నారు. ఈ యాత్రలో పంచ ద్వారకతో పాటు నిష్కళంక మహాదేవ్, జ్యోతిర్లింగాల దర్శనం ఉంటుందన్నారు. ఇందులో ద్వారక, డాకోర్ ద్వారక, నాథ్ ద్వారక, కంక్రోలి ద్వారక, బేట్ ద్వారక, సోమనాథ్, నాగేశ్వర్, సోమనాథ్, నాగేశ్వర్, నిష్కలంక మహాదేవాలయంతో పాటు యాదగిరి, స్టాట్యూ అఫ్ ఈక్విటీ, స్టాట్యూ అఫ్ యూనిటీ ఉంటాయన్నారు.

ఆర్మీ అధికారుల అనుమతి తీసుకోవాలని కమిషనర్‌కు వినతి

రోడ్డును చదును చేసేందుకు ఆర్మీ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని కమీషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు.

నార్సింగి, అక్టోబర్ 7 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని బైరాగిగూడ నుంచి నార్సింగి వైపుకు వెళ్లే రోడ్డును చదును చేసేందుకు ఆర్మీ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని కోరుతూ కమీషనర్ శరత్ చంద్రకు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్, సీనియర్ నాయకులు దప్పు నవీన్, శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ రోడ్డంతో కిలో మీటర్ దూరం గుంతలమయమైందని, దీని వలన రాకపోకలు సాగించేందుకు వాహనదారులు నరకాయతన పడుతున్నారని తెలిపారు. నిత్యం ఈ రోడ్డుపై వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, వాహనదారుల ఇబ్బందులను తొలగించేందుకు జేసీబీతో అక్కడికి తాము వెళితే ఆర్మీ జవాన్లు అభ్యంతరం తెలిపారన్నారు. మా పై అధికారుల నుంచి అనుమతి తీసుకొని రోడ్డును చదును చేసుకోవాలని సూచించారని వివరించారు. కార్పోరేషన్ కమీషనర్ హోదాలో ఆర్మీ అధికారులకు లెటర్ రాసి రోడ్డు చదును కోసం అనుమతి పొందాలని కమీషనర్‌ను కోరామన్నారు. ఇందుకు కమీషనర్ శరత్‌చంద్ర స్పందిస్తూ ఆర్మీ అధికారులకు లేఖ రాసి, అనుమతి తీసుకుంటామని హామీనిచ్చారు.

గంజాయిని రవాణా చేస్తూ విక్రయించే నిందితుల అరెస్టు

సరూర్‌నగర్, అక్టోబర్ 7 ప్రభాతవార్త: ఒరిస్సా నుండి గంజాయిని హైదరాబాద్ నగరానికి రవాణా చేస్తూ విక్రయించే ఇద్దరు నిందితులను బాలాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. గంజాయిని సరఫరా చేసే ఒరిస్సాకు చెందిన మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. ఈ మేరకు పట్టుబడిన ఇద్దరు నిందితుల నుండి రూ.లక్ష విలువ చేసే నాలుగు కిలోల ఎండు గంజాయిని అదే విధంగా రవాణాకు ఉపయోగించిన స్కూటర్‌ను స్వాధీనం చేసుకొని పోలీసులు కేసును నమోదు చేశారు. ఇన్స్పెక్టర్ సుధాకర్ తెలిపిన ప్రకారం ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రోషన్‌దౌలాకు చెందిన లేబర్ పని చేసే బిసా కొమురి అలియాస్ చింటు (19), కోకిలగడ్డ ఆహరుణ్ అలియాస్ అరుణ్ (20)లు తేలికగా డబ్బు సంపాదించడానికి ఒరిస్సా నుండి అక్రమంగా గంజాయిని రవాణా చేస్తూ అవసరమైన వారికి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటుంటారు. అయితే మంగళవారం బాలాపూర్ శివాజీ చౌక్ వద్ద బాలాపూర్ ఎస్ఐ ఎస్.కోటేశ్వర్‌రావు సిబ్బందితో కలిసి తనిఖీలు చే స్తుండగా అనుమానాస్పద స్థితిలో కొమురి, అరుణ్‌లు పట్టుబడ్డారు. ఈ మేరకు పోలీసులు జరిపిన విచారణలో వారు గంజాయిని ఒరిస్సా నుండి ద్విచక్ర వాహనంపై నగ రానికి తరలిస్తూ అవసరమైన వారికి విక్రయించే వారని తేలింది. ఈ నేపథ్యంలో నిందితుల నుండి గంజాయిని, ద్విచక్ర వాహనాన్ని (నెంబర్ హోండా డియో టిఎస్ 07 కెడి 8147) స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులతో పాటు పరారీలో ఉన్న ఒరిస్సా రాష్ట్రం కలిమెల జిల్లా నాగలూర్ గ్రామానికి చెందిన అర్జున్‌పై కూడా కేసును నమోదు చేశారు.

అదరగొట్టిన కోల్‌కతా.. కొచ్చిపై ఘన విజయం

హైదరాబాద్, అక్టోబర్ 6,ప్రభాతవార్త:

ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్ లో కోల్‌కతా థండర్‌బోల్ట్స్ అదిరిపోయే ప్రదర్శనతో బోణీ కొట్టింది. మంగళవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో థండర్ బోల్ట్స్ 31 (1215, 1512, 156, 1917) తేడాతో కొచ్చి బ్లూ స్పైకర్స్‌పై అద్భుత విజయం సాధించింది. కోల్‌కతా విజయంలో కీలక పాత్ర పోషించిన పంకజ్ శర్మ ఖిస్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌ఖిగా నిలిచాడు.గత మ్యాచ్‌లో గెలిచిన ఉత్సాహంతో బరిలోకి దిగిన కొచ్చి బ్లూ స్పైకర్స్, హేమంత్ పవర్‌ఫుల్ సర్వీసులతో మ్యాచ్‌ను దూకుడుగా ప్రారంభించింది. ఇరు జట్ల డిఫెన్స్ పటిష్టంగా ఉండటంతో పాయింట్ల కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. కొచ్చి సెట్టర్ బైరాన్ కెటుకారిస్ తెలివైన పాస్‌లతో కోల్‌కతాను ఒత్తిడిలోకి నెట్టి తొలి సెట్‌ను తమ జట్టుకు అందించాడు. అయితే రెండో సెట్ నుంచి కోల్‌కతా అసలు ఆట మొదలుపెట్టింది. కెప్టెన్ అశ్వల్ రాయ్, పంకజ్ శర్మ పదునైన దాడులతో కొచ్చి కోర్టులో అలజడి సృష్టించారు. మరోవైపు, అభిషేక్ సూపర్ సర్వ్‌తో ఆకట్టుకున్నా, కొచ్చి జట్టు చేసిన అనవసర తప్పిదాలు వారికి ప్రతికూలంగా మారాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న కోల్‌కతా రెండో సెట్‌ను గెలిచి మ్యాచ్‌ను సమం చేసింది. మూడో సెట్‌లో కోల్‌కతా పూర్తి ఆధిపత్యం చెలాయించింది. మిడిల్ జోన్‌లో మాటిన్ తకవర్ అద్భుతంగా రాణించడంతో కొచ్చి జట్టు తేలిపోయింది. ఈ సెట్‌ను కోల్‌కతా 156తో సునాయాసంగా కైవసం చేసుకుంది. ఇక నాలుగో సెట్ నువ్వానేనా అన్నట్టు సాగింది. విజయం కోసం కొచ్చి చివరి వరకు పోరాడినప్పటికీ, కీలక సమయంలో మాటిన్ అద్భుతమైన బ్లాక్‌తో కోల్‌కతాకు 1917తో సెట్‌తో పాటు మ్యాచ్‌ను కూడా అందించాడు. ఈ సీజన్‌లో కోల్‌కతాకు ఇదే తొలి విజయం.

బధిరుల కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

చిక్కడపల్లి, అక్టోబరు 7 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో బధిరుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ అధినేత వల్లభనేని ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వి. భారతీ, ఉపాధ్యక్షుడు కె. వెంకటేశ్ గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బధిరుల విద్య, ఉపాధి, సంక్షేమ రంగాల్లో అనేక సమస్యలు కొన సాగుతున్నాయని తెలిపారు. మలకపేటలోని ప్రభుత్వ బధిరుల స్కూల్ ఆవరణలో ప్రభుత్వ హాస్టల్లో జూని యర్ ఇంటర్ నుంచి డిగ్రీ వరకు కాలేజీ ఏర్పాటు చేసి వసతులు కల్పించాలన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో సైగల భాష ద్వారా ప్రత్యేక మూగ బధిరుల స్కూల్ హాస్ట ల్ వసతులు కల్పించాలని కోరారు ప్రతి జిల్లాలో బధిర విద్యార్థుల కోసం 25 శాతం రిజర్వేషన్ కల్పించాల న్నారు. బధిరుల కోసం ప్రత్యేకంగా ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. బధిర విద్యార్థుల ఉన్నత విద్య కోసం ప్రభుత్వ పథకాలు, స్కాల రిష్షు అమలు చేయాలన్నారు. బధిరుల కోసం ట్రైనింగ్ సెంటర్లు, ఎంప్లాయ్మెంట్ అవకాశాలు కల్పించాలి. నాలుగు శాతం రిజర్వేషన్ కచ్చితంగా అమలు చేయా లన్నారు. బధిరుల సంక్షేమ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యం : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

-ఎమ్మెల్యే చొరవతో రూ.10 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

అత్తాపూర్ అక్టోబరు7,ప్రభాతవార్త :

నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పన కోసం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చేసిన కృషి ఫలించింది. రాజేంద్రనగర్ సర్కిల్11 పరిధిలోని డివిజన్లలో అత్యవసరంగా నిర్మించాల్సిన సీసీ రోడ్ల పనుల మంజూరుకై ఎమ్మెల్యే ఇటీవల చార్మినార్ జోనల్ కమిషనర్ ని కలిసి విజ్ఞప్తి చేయగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అభ్యర్థన మేరకు మైలార్‌దేవపల్లి (వార్డు59) మరియు రాజేంద్రనగర్ (వార్డు61) డివిజన్లతో సహా పలు ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి పనుల కోసం జీహెచ్ఎంసీ అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ జారీ చేసింది. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ....నియోజకవర్గంలోని మైలార్‌దేవ్‌పల్లి,రాజేంద్రనగర్,అత్తాపూర్ డివిజన్‌లలో అభివృద్ధి పనులు మైనర్ రోడ్ల ,అప్‌గ్రేడేష్ కింద సిసి రోడ్ల నిర్మాణానికి 10 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో రోడ్ల దుస్థితి ఒకటి అన్ని ముఖ్యంగా వర్షాకాలంలో ఇబ్బందులు పడకుం

డా ఉండేందుకు సిసి రోడ్లు అత్యవసరం అన్నారు.తన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని 10 కోట్ల రూపాయల పనులకు త్వరగా అమోదం తెలిపిన చార్మినార్ జోనల్ కమిషనర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ నిధులతో రోడ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ అభివృద్ధి పనులు టెండర్ ప్రక్రియ ప్రారంభించి ప్రజల ఇబ్బందులను తీర్చాలని అధికారులకు ఆదేశించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి : ఆకుల సతీష్

దుండిగల్, అక్టోబర్ 7, ప్రభాతవార్త

సర్వే నెంబర్ 170/3,4 మల్లంపేట జిఎల్ఎస్ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ నందు మళ్ళీ అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమి ఎఫ్టిఎల్ బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఆకుల సతీష్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ చేపట్టిన జిఎల్ఎస్ కాలనీ నందు రోడ్డు నెంబర్ 11 టూ 10 మధ్యలో దాదాపు ఎకరం స్థలం నందు సర్వే నెంబర్ 170/3,170/4 సంబంధించిన ప్రభుత్వ భూమిలో టిఎస్ బి పాస్ ఇన్సంట్ ఒక అనుమతితో ఆరు విల్లాస్ నిర్మాణలు గత నెల రోజులుగా జరుగుతున్నాయన్నారు. 3విల్లాల నిర్మాణానికి టీఎస్ బి పాస్ ఇన్సంట్ ద్వారా అనుమతులు పొందడం, మళ్ళీ ఏమైందో తెలియదు మున్సిపల్ అధికారులు వాటిని రద్దు చేయడం జరిగిందన్నారు. శ్రీ వినాయక రియాల్టర్స్ డెవలపర్స్ పేరుతో అనుమతులు పొంది నిర్మాణం ఏ విధంగా చేస్తున్నారో సంబధిత అధికారులు సమాధానం చెప్పాలన్నారు. సర్వే నెంబర్ 170/3, సర్వేనెంబర్ 170/4 నందు ప్రభుత్వ భూమి కలదని, గతంలో ఇదేవిధంగా సరైన అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమి చెరువులో చేపట్టిన నిర్మాణాలను కొనుగోలు చేసిన ప్రజలు పడిన ఇబ్బందులు

అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఆకుల సతీష్

చూసిన అధికారులు ఒకే ఒక తప్పుడు అనుమతితో ఆరు విల్లాల నిర్మాణం జరుగుతున్న ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తక్షణమే అనుమతుల్లేని ప్రభుత్వ భూమి, కత్వ చెరువు బఫర్ జోన్ నందు నిర్మాణాలు చేస్తున్న శ్రీ వినాయక రియాల్టర్స్ డెవలపర్స్ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయడమే కాకుండా, ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణాల చేసిన శ్రీ వినాయక రియాల్టర్స

త్యాగాల తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా చేయవద్దు

టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా

సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

ముషీరాబాద్, అక్టోబర్ 7, ప్రభాతవార్త: ఎందరో అమర వీరుల త్యాగాలతో సాధించుకున్న తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా తయారు చేయవద్దని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా హితవు పలికారు. మంగళవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చీటికి మాటికి గాంధీ వారసులమని చెప్పుకునే కాంగ్రెస్ నాయకుల పాలనలో తెలంగాణలో మద్యం ఏరులై పారుతోందని ఆరోపించారు. గతంలో కేసీఆర్ తెలంగాణను మత్తులో ముంచివేస్తే, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే పంథా కొనసాగిస్తూ, తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీస్తోందని ధ్వజమెత్తారు. ఇటీవల మద్యం షాపుల టెండర్లలో కూడా మూడు లక్షల నాన్‌రిఫండబుల్ డిపాజిట్‌లు వసూలు చేసి, అమ్మకాలకు టార్గెట్లు పెట్టటం, మద్యం ధరలు పెంచటం చూస్తూ ఉంటే కాంగ్రెస్‌కు ప్రజల ఆరోగ్యం పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం బతుకమ్మ పేరుతో కనీసం నాశిరకం చీరలైనా ఇచ్చిందని, ఇప్పటి ప్రభుత్వం ఇందిరమ్మ చీరల పేరుతో ఆమె చనిపోయిన రోజు ఇస్తామని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. ఇందిరమ్మపై ప్రేమ ఉంటే కాంగ్రెస్ నాయకులు వాళ్ల పిల్లలకు పెట్టుకోవాలి తప్ప ప్రతి దానికి ఇందిరమ్మ పేరు పెడతా మంటే తెలంగాణ ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. కార్యక్రమంలో నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, కిరణ్, తడక వినోద్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : జంపనప్రతాప్

కంటోన్మెంట్ 3వ వార్డులో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్,అక్టోబర్ 7 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 3వ వార్డు ఈద్గా అంబేద్కర్ నగర్ పరిసర ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌ల దృష్టికి తెచ్చి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. సోమవారం 3వ వార్డులో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్తీలో అంగన్‌వాడి సూళ్లు ఏర్పాటు చేయాలని, శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్లను తొలగించాలని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజేశ్ యాదవ్, జమీల్, రాజు, మురళీ పాల్గొన్నారు.

అన్నదానం చేసిన జంపన . . .

పౌర్ణమిని పురస్కరించుకొని 6వ వార్డు సీతారాంపూర్‌లోని శివపంచాయతన హన్‌మాన్ దేవాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సీనియర్ కాంగ్రెస్ నేత జంపనప్రతాప్ నప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిబాబా యాదవ్, మనోహర్, రాజేందర్, శ్రీకాంత్‌రెడ్డి, నారాయణచారి తదితరుల పాల్గొన్నారు.

హైదరాబాద్ సిపి సజ్జనార్‌ను కలిసిన ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

విసి.సజ్జనార్‌కు మొక్కను అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

సంజీవరెడ్డి నగర్,అక్టోబర్ 7 ప్రభాతవార్త: ఎస్.ఆర్.నగర్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనాథ్‌రెడ్డి నూతనంగా హైదరాబాద్ కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వి.సి.సజ్జనార్‌ను మర్యాదపూర్వంకగా కలిసి మొక్కను అందజేసి శుభాకాక్షలు తెలిపారు. అనంతరం ఎస్.ఆర్.నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల గురించి హైదరాబాద్ కమిషనర్ విసి.సజ్జనార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డిని అడిగి తెలుకున్నారు.

ఉప్పరి శేఖర్ సాగర్‌కు ఘన సన్మానం

శేఖర్ సాగర్‌ను సన్మానిస్తున్న సగర సంఘం సభ్యులు

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 7, ప్రభాతవార్త

అమెరికా కాలిఫోర్నియా గ్లోబల్ యూనివర్సిటీ వారు తెలంగాణ రాష్ట్ర సగర సంగం అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సాగర్‌కు డాక్టరేట్ పురస్కారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో జగద్గిరిగుట్ట సగర సంఘం వారు వెంకటేశ్వర్ నగర్ సగర సంగం కార్యాలయంలో ఉప్పరి శేఖర్ సాగర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సగర సంగం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సగర జాతి అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతుండడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలో తన వంతు పాత్ర పోషిస్తూ పలువురి మన్ననలు పొందిన ఉప్పరి శేఖర్ సాగర్‌కు డాక్టరేట్ రావడం అభినందనీయ మనీ అన్నారు. ఈ కార్యక్రమం సగర సంగం అధ్యక్షులు నగరాల రామకృష్ణ సాగర్, ప్రధాన కార్యదర్శి వేముల సుదర్శన్ సాగర్, కోశాధికారి ఎమ్మెస్ భీమయ్య సాగర్, రాష్ట్ర నాయకులు సిహెచ్ శ్రీనివాస్ సాగర్, ఎస్ గంగాధర్ సాగర్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సగర మహిళా సంఘం వారు శేఖర్ సాగర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సాగర సంగం అధ్యక్షులు మోడల రవి సాగర్, ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకట రాములు సాగర్, గౌరవ అధ్యక్షులు ఆస్కాని వెంకటస్వామి సాగర్, రాష్ట్ర నాయకులు కే పి రామ్ సాగర్, కేపీ రాములు సాగర్, ఎం రాములు సాగర్, ఆస్కానీ శ్రీనివాస సాగర్, మహిళా సంఘం నాయకులు గౌని కుసుమమ్మసాగర్, ఆర్ డి శాంత, సిహెచ్ జ్యోతి సాగర్ పాల్గొన్నారు.

సంతకాల సేకరణ కార్యక్రమానికి తరలివెళ్లిన కాంగ్రెస్ నేతలు

బోయిన్‌పల్లి మార్కెట్ నుంచి బాలంరాయికి తరలివెళ్తున్న మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు తదితరులు

కంటోన్మెంట్,అక్టోబర్ 7 ప్రభాతవార్త:

ఓట్ చోరీకి వ్యతిరేకంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ ఆధ్వర్యంలో మంగళవారం బాలంరాయి చౌరస్తాలో నిర్వహించిన సంతకాల సేకరణకు బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు,నాయకులు, మార్కెట్ సభ్యులు తరలివెళ్ళారు.

ఓట్ల చోరీతో బిజెపి ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తుంది : విశ్వనాథన్

కంటోన్మెంట్,అక్టోబర్ 7 ప్రభాతవార్త: కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఎన్నికల కమీషన్‌తో కుమ్మక్కై ప్రజా స్వామ్యాన్ని కూనీ చేస్తుందని ఏఐసీసీ ఇన్‌ఛార్జి కార్యదర్శి విశ్వనాథన్, కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేషన,రాజ్యసభ సభ్యుడు అనీల్ కుమార్ యాదవ్‌లు ఆరోపించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా మంగళవారం కంటోన్మెంట్ 3వ వార్డులోని బాలంరాయి చౌరస్తాలో నిర్వహించిన ఓట్ చోరీతో ప్రమాదంలో భారత ప్రజా స్వామ్యం వ్యవస్థను నిరసిస్తూ ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. దేశంలో బిజెపి ప్రభుత్వం దొడ్డిదారిలో అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ఎన్నికల కమిషన్‌తో కుమ్మక్కై ఓట్ల చోరీకి పాల్పడిందన్నారు. బిజెపి ఓట్ల చోరీకి పాల్పడకుండా ఉంటే గత లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేదన్నారు. రాహుల్ గాంధీ బెంగుళూర్‌లో నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఓట్ల చోరీ జరుగుతున్న తీరును కండ్లకు కట్టినట్లు వివరించారన్నారు. వచ్చే బిహార్ ఎన్నికల్లో బిజెపి ఎన్నికల కమిషన్‌తో కుమ్మక్కైయే అవకాశాలున్నాయన్నారు. ఈ

ఓట్ చోరీ సంతకాల సేకరణలో ప్రసంగిస్తున్న ఏఐసీసీ ఇన్‌ఛార్జి కార్యదర్శి విశ్వనాథన్, ఎమ్మెల్యే శ్రీగణేష్,ఎంపీ అనీల్‌కుమార్ యాదవ్ తదితరులు

కార్యక్రమానికి కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి బారీ సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి సంతకాల సేకరణలో పాల్గొన్నారు. ఓట్ చోరీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు, మార్కెట్ తొలి చైర్మన్ ముప్పిడి గోపాల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిర్రబోయిన సంతోష్ యాదవ్, బద్రినాథ్ యాదవ్, అల్లాడి గౌరి శంకర్, నందికంటి రవి, అరవింద్ యాదవ్, రాజేశ్ యాదవ్, నాగినేని సరిత, మురళీ ముదిరాజ్, మారుతీ గౌడ్, వరలక్ష్మి, చింతల వేణుగోపాల్‌రెడ్డి, మప్పిడి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్విన్ కాలనీలో వాల్మీకి జయంతి వేడుకలు

కూకట్‌పల్లి, అక్టోబర్ 7, ప్రభాతవార్త

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ జన్మభూమి కాలనీలో స్థానిక నాయకులు బోయ కిషన్ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పిఏసి చైర్మన్ పరికెపూడి గాంధీ ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి వాల్మీకి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చైర్మన్ గాంధీ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి గొప్ప వ్యక్తి అని, సంస్కృత సాహిత్యంలో పేరెన్నికగల కవి అని అన్నారు. ఆయన జీవితం ఎంతో మందికి ఆదర్శం, స్ఫూర్తిదాయకం అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీవాసులు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేవి ఎన్నికల ఎత్తుగడ : యుగంధర్ రెడ్డి

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 7, ప్రభాతవార్త

ఫిరోజ్ గూడా కమాన్ నిర్మాణంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్ర నిర్లక్ష్యం కావాలనే చేసి తాను అనుకున్న పథకం ప్రకారమే తాజాగా కమాన్ నిర్మాణం పూర్తి చేశాడని, ఇది కేవలం త్వరలో జరగబోయే కార్పొరేటర్ ఎన్నికలకు సంబంధించిన ఎత్తుగడలే తప్ప ప్రజల మీద ఆయనకు నిజమైన ప్రేమ లేదని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ నిధులు వెచ్చించి నిర్మించినట్లయితే నిధులు రావడంలో ఆలస్యం జరుగుతుందని కానీ ఎమ్మెల్యే తన జేబులో నుండి సొంతంగా డబ్బు ఖర్చుచేసి నిర్మాణం చేపట్టడంలో ఆలస్యం ఎందుకు జరిగిందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే తలచుకుంటే కమాన్ నిర్మాణం వ్యయానికి సంబంధించి సదరు నిర్మాణదారుడికి ఒకేసారి డబ్బు చెల్లించగల సత్తా ఉందన్నారు. కానీ అలా చేయకుండా నిర్మాణంలో ఆలస్యం చేస్తే ప్రజలు సార్ కమాన్ నిర్మాణం ఏమైంది, జర చూడండి సార్ అని బ్రతిములాడుకునే పరిస్థితికి తీసుకెళ్లాడని తెలిపారు. స్థానిక ఫిరోజ్ గూడా నివాసితులు అందరికీ ఈ విషయం తెలుసునని అన్నారు. ఇది నిజమా కాదా, ఎమ్మెల్యే చెప్పాలి అని ప్రశ్నించారు. స్థానిక ప్రజలు గానీ, లేక ఇంకా వేరే ఏ ప్రజలైనా సరే ఒక్కసారి ఆలోచించాలన్నారు. ఎమ్మెల్యే దగ్గర డబ్బులు లేవా? ఉన్నాయా? డబ్బులు లేక పోతే మరి ఎందుకు సొంత నిధులతో నిర్మిస్తానని మాట ఇచ్చావు, డబ్బులు ఉంటే మరి ఒకేసారి పేమెంట్ చేస్తే సరిపాయె, చకచకా పనులు పూర్తి అయి ఒక మూడు నెలల లోపలనే కమాన్ నిర్మాణం పూర్తి అయి ఉండేది, ఇప్పుడు ఏకంగా రెండు సంవత్సరాలు ఎందుకు పట్టిందని యుగంధర్ రెడ్డి ప్రశ్నించారు.

శ్రీ కార్కానా మైసమ్మ దేవాలయంలో పూజలు

పూజ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ కార్కానా మైసమ్మ దేవాలయం కమిటి ప్రతినిధులు

చార్మినార్,అక్టోబరు 7 ప్రభాతవార్త : పురానాపూల్ గల్బ వీధిలోని శ్రీ కార్కానా మైసమ్మ దేవాలయంలో మంగళవారం పూజలు జరిగాయి.శ్రీ కార్కానా మైసమ్మ దేవాలయం కమిటి అధ్యక్షులు ఎం.మహేష్ గౌడ్,కార్యవర్గ సభ్యులు పుస్తె శ్రీ కాంత్,విష్ణుగౌడ్,టి.రంజిత్ సింగ్,ఎం.సందీప్ గౌడ్, జయనాథ్,గణేష్, సూర్య, సాయి, మనీష్, నరేష్,టి.రాహుల్ సింగ్,యోగేష్, విఘ్నేష్,మణిదీప్ పాల్గొని మందిరంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

ఆరు గ్యారంటీల అమలుపై నిలదీయండి

: ఎమ్మెల్యే కెపి వివేకానంద్

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 7, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ప్రజల సంక్షేమం, అభివృద్ధికి దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చేసిన సేవలను ప్రజలు స్మరించుకుంటున్నారని బోరబండ డివిజన్ బీఆర్ఎస్ ఇంచార్జ్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మంగళవారం బోరబండ డివిజన్ అన్నానగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్‌తో కలిసి ఎమ్మెల్యే వివేకానంద్ అన్నానగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలు వాగ్దానాల విషయమై ప్రత్యేక కార్డులను ప్రజలకు పంపిణీ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలను నయవంచన చేసేందుకు ప్రచారం పేరుతో తిరుగుతున్న కాంగ్రెస్ నాయకులకు బాకీ కార్డు చూపించి ఆరు గ్యారంటీల అమలుపై నిలదీయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాగంటి గోపీనాథ్ కుమారుడు మాగంటి వాత్సల్య నాథ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు కృష్ణమోహన్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

యువత బైకుల మీద స్టంట్స్ చేయొద్దు

టీటీఐలో నిర్వహించిన ట్రాఫిక్ ప్రమాదాల నివారణ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ 1 వేణుగోపాల్‌రెడ్డి.

బేగంపేట అక్టోబరు 7,ప్రభాతవార్త

యువత లైక్స్,వ్యూస్ కోసం బైకుల మీద స్టంట్స్ చేస్తూ వారి అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్నారని.ట్రాఫిక్ 1 అడిషనల్ డీసీపీ సి.వేణుగోపాలరెడ్డి అన్నారు.హైదరాబాద్ పోలీసు కమీషనర్ వి.సి.సజ్జనార్ ,ట్రాఫిక్ జాయింట్ సీ.పీ. జోయల్ డేవిస్ ఆదేశాల మేరకు మంగళవారం సీఎస్సై ఇనిసిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్కూలు ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ విద్యార్థులకు బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిసిట్యూట్ (టీటీఐ)లో రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అనే అంశంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు.ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు.రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలన్నారు.యువత ముఖ్యంగా డ్రగ్స్,మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో టీటీఐ ఇన్స్‌పెక్టర్ నాగుల అశోక్,మేనేజర్ డా.దయానంద్ కరుణాకర్,ప్రిన్సిపాల్ ప్రొఫెసర్న సుమన్ రేఖ,హెచ్ ఓ డి ప్రొఫెసర్ సుస్మిత,100మంది విద్యార్థులు,టీటీఐ సిబ్బంది సాయికుమార్,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా నిరంతర కృషి : కె.ఎం.గౌరీష్

కుత్బుల్లాపూర్, అక్టోబరు 7 ప్రభాతవార్త

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రసమితి అభ్యర్థి మాగంటి సునిత గోపీనాథ్ గెలుపే ధ్యేయంగా నిరంతరం శ్రమించాలని కుత్బుల్లాపూర్ మాజీ కార్పొరేటర్ , బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కె.ఎం.గౌరీష్ పిలుపునిచ్చారు. మంగళవారం బోరబండ డివిజన్ పరిధిలోని బంజారానగర్ లోని ఏడుబూతులతో ప్రచారానికి కుత్బుల్లాపూర్ డివిజన్ నుండి కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ నియమించిన బాధ్యులు, కార్యకర్తలతో గౌరీష్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రతిఒక్కరూ వారికి కేటాయించిన పోలింగ్‌బూత్‌లో ప్రతిఒక్క ఓటరు వద్దకు వెళ్లి విస్తృత ప్రచారాన్ని నిర్వహించాలని సూచించారు. నియోజకవర్గంలో బిఆర్ఎస్ హాయాంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత హామీలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని విజ్ఞప్తిచేశారు. ఎన్నికల బూత్‌స్థాయి బాధ్యులతోపాటు కార్యకర్తలందరూ సమన్వయంగా పనిచేసి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునిత గోపీనాథ్ ను భారీ మెజార్టీతో గెలుపొందేలా పాటుపడాలని కె.ఎం.గౌరీష్ నిర్దేశం చేశారు. బంజారానగర్‌లోని ఏడు బూత్‌ల బాధ్యులు ఇందుకూరి సూర్యప్రభ, దేవరకొండ శ్రీనివాస్, సత్తిరెడ్డి, కిశోర్‌చారి, ఆంజనేయులు, రమేశ్, వడ్లస్వామి, మధుకర్ రెడ్డిలతోపాటు సీనియర్ నాయకులు, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి : కొంతం దీపిక

కంటోన్మెంట్,అక్టోబర్ 7 ప్రభాతవార్త:

మోండా డివిజన్‌లోని మారేడ్‌పల్లి రెజిమెంటల్ బజార్, ఎల్.శంకర్ నగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగంతం చేయాలని మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక సూ చించారు. మంగళవారం ఎల్.శంకర్ నగర్‌లో కొనసాగుతున్న నాలా పైప్‌లైన్ పనులను జిహెచ్ఎంసి ఇంజనీర్లతో కలిసి పర్యవేక్షించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలి : గోనె సాల్మన్‌రాజ్

చిక్కడపల్లి, అక్టోబరు 7 ప్రభాతవార్త: మైనారిటీ, దళిత మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పై మరో మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను శోచనీయమని తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ పాస్టర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ ఆఫ్ 33 జిల్లాల క్రైస్తవులు. దళిత క్రైస్తవులంతా ముక్తకంఠంతో మంత్రి వ్యాఖ్యలను వ్యతిరేకిస్తున్నారని, మంత్రుల మధ్య సంభాషణలో దున్నపోతు" వంటి అవమానకర పదజాలం వాడటం అసహ్యకరమైనదని, ప్రజాస్వామ్యంలో పదవిలో ఉన్న మంత్రులు మర్యాద, భాష, వ్యవహార శైలి విషయంలో ఆదర్శంగా ఉండాలి. తెలంగాణలో సమా నత్వం, సామాజిక న్యాయం సాధించాలనుకున్న కాంగ్రెస్ విలువలకు ఇది విరుద్ధంమని, సిఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు సభ్యులు ఈ విషయాన్ని

ప్రసంగిస్తున్న తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్

పరిశీలించి, దళితులకు న్యాయం చేయాలని కోరారు. తక్షణమే ఈ ఘటనపై వివరణ తీసుకొని చర్యలు చేపట్టడంతో పాటు.దళిత గౌరవం పట్ల ప్రభుత్వం అచం చలంగా ఉందని స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు.

పాలస్తీనాపై చేస్తున్న దాడులను తక్షణమే ఆపాలి

ధర్నాచౌక్, అక్టోబర్ 7, ప్రభాతవార్త: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమణ దాడులను తక్షణమే ఆపాలని వామపక్ష పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పాలస్తీనా సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో పాలస్తీనా ప్రజలకు సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. అశోక్‌నగర్ నాలా నుండి ఇందిరాపార్కు ధర్నాచౌక్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో సీపీఐ నాయకులు అజీజ్ పాషా, సీపీఎం రాష్ట్రకార్యదర్శి జాన్‌వెస్లీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కే.రమ, బి.ప్రదీప్, ఎంసీపీఐ గాదరగోని రవి, ఎస్‌యుసీఐ మురహరి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇజ్రాయిల్ అమెరికా సామ్రాజ్యవాదం వత్తాసుతో దురహంకారంగా దాడులు, యుద్ధాలు చేస్తోందని ఆరోపించారు. గత రెండు సంవత్సరాలుగా దాదాపు 70వేల మంది పాలస్తీనా ప్రజలను హత్యగావించారని, 20లక్షల జనాభాను ఖాళీ చేయించి, రిసార్ట్ నిర్మిస్తామని ట్రంపు వ్యాఖ్యానించటం దుర్మార్గమని అన్నారు. గాజాపై యుద్ధాన్ని ఆపాలని ముక్త కంఠంతో

పాలస్తీనాకు మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నేతలు

ప్రపంచం హోరెత్తినా చలించటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పాలస్తీనాపై దాడులను ఆపి, 145 దేశాల మాదిరిగానే పాలస్తీనాను గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాలన్నీ కలసి గాజాను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు స్టాలిన్, సీపీఎం నాయకులు మహేందర్, సాగర్, డి.జి.నర్సింహారావు, అబ్బాస్, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ గ్రేటర్ కార్యదర్శి హన్మేష్, సదానందం, ఎస్.ఎల్.పద్మ, ఝాన్సీ, ఎంసీపీఐ నేత అనిల్‌కుమార్, ఎస్‌యుసీఐ నేత విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పలు సమస్యలపై వాటర్ వర్క్స్ జిఎం శ్రీధర్ రెడ్డికి వినతి

చిక్కడపల్లి, అక్టోబరు 7 ప్రభాతవార్త:

రాంనగర్ డివిజన్‌లో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు బీజేపీ సికింద్రాబాద్ మహాంకాళి జిల్లా అధ్యక్షులు గుండగోని భరత్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డిని కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. పలు ప్రాంతాల్లో పాదయాత్ర చేసి సమస్యల పరిష్కారానికి కావాలసిన నిధులను అంచనా వేయాలని సూచించారు. వెస్లీ చర్చీ, పాలమూరిబస్తీలలో సీవరేజ్ సమస్య, నెహ్రూ నగర్ ఏ, సర్వోదయ నగర్, ఈడబ్ల్యుఎస్ క్వార్టర్స్, పాలమూరి బస్తీ తదితర ప్రాంతాలలో కొత్త పైప్ లైన్లు, శ్రీరాంనగర్ కమ

టి హాల్, అరుంధతి స్కూల్, కరాచీ బేకరి వెనుక భాగం, చిక్కడపల్లి కమ్యూనిటీ హాల్లో హ్యాండ్ బోర్లు వేయాలని ప్రతిపాదించడం జరిగింది. దీనికి స్పందించిన జి.ఎం శ్రీధర్ రెడ్డి అభివృద్ధి పనులకు సంబంధించిన ఖ ర్చులను అంచనావేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డిజిఎం మోహన్ రాజు, మేనేజర్ జీవన్ జ్యోతి, బీజేపీ సీనియర్ నాయకులు సి.పార్థ శారది, పి. జయపాల్ రెడ్డి, జి. కిరణ్ కుమార్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR, HYDERABAD (SOUTH) AT ERRAGADDA
ABR.CF.No: HS 69 OF 2025

Between :-
M/S MARGADARSI CHIT FUND PRIVATE LIMITED, (formerly known as Margadarsi Chit Fund Limited), MEHDIPATNAM BRANCH, represented by its Foreman/ Branch Manager.
...DISPUTANT
AND
MR DYAPA VENKATESHWAR REDDY & OTHERS
...OPPONENTS

TO,
OPP NO.1.MR DYAPA VENKATESHWAR REDDY S/O DYAPA MOHAN REDDY, DOB:29

కురుమ సంఘం నూతన కమిటీకి శుభాకాంక్షలు

గడ్డి అన్నారం కార్పొరేటర్‌తో భైర శంకర్ తదితరులు

హుడా కాంప్లెక్స్, అక్టోబర్ 7, ప్రభాతవార్త:
గడ్డిఅన్నారం మున్సిపాలిటీ కురుమ సంఘం నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన స్థానిక కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి. గడ్డిఅన్నారం మున్సిపాలిటీ కురుమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా మంగళవారం సంఘ సభ్యులు గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి గారిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి గారు నూతన కార్యవర్గ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సంఘ అభివృద్ధి, సభ్యుల ఐకమత్యం, సామాజిక సేవల దిశగా నూతన కమిటీ చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మున్సిపాలిటీ కురుమ సంఘం అధ్యక్షుడు భైర శంకర్, ఉపాధ్యక్షుడు మేకల ఒదయ్య, ప్రధాన కార్యదర్శి తుప్పటి శ్రీకాంత్, ఉప ప్రధాన కార్యదర్శి సమ్ము శ్రీనివాస్, కోశాధికారి సమ్ము రాజు, సభ్యులు సమ్ము రాములు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మల్ రెడ్డి రంగారెడ్డి

వనస్థలిపురం అక్టోబర్.7.ప్రభాతవార్త
బి.ఎన్. రెడ్డి డివిజన్ టీచర్స్ కాలనీ యువకుడు పోలే చంద్రశేఖర్ అమెరికా టెక్సాస్‌లోని డల్లాస్ నగరంలో గుర్తు తెలియని దుండగుల కాల్పుల్లో మృతి చెందడం ఎంతో బాధాకరమని ఎమ్మెల్యే మాల్లారెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి బి.ఎన్. రెడ్డి నగర్‌లోని చంద్రశేఖర్ కుటుంబాన్ని సందర్శించి, ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ, ఈ కష్టసమయంలో ప్రభుత్వం మరియు పార్టీ తరఫున అన్ని విధాల సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ పన్యాల జయపాల్ రెడ్డి, హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, వినయ్ పాటిల్ గార్లు కలిసి చంద్రశేఖర్‌కు నివాళి అర్పించి కుటుంబాన్ని పరామర్శించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : కోట్ల శ్రీనివాస్

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానించి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్న వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, డైరెక్టర్ మస్రత్ సుల్తానాలు

మలక్ పేట ,అక్టోబర్ 7, ప్రభాతవార్త:
కాంగ్రెస్తోనే అభివృద్ధి సాధ్యమని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ డైరెక్టర్ మస్రత్ సుల్తానాలు పేర్కొన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ను వారు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. హైదరాబాద్ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లలో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి మంత్రికి వివరించడం జరిగిందని వారు తెలియజేశారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ పద సంచాలన్ కార్యక్రమం

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకర్తలకు పూలతో స్వాగతం పలుకుతున్న ముసారాంబాగ్ డివిజన్ భాగ్యలక్ష్మీ భాగ్యనగర్ జిల్లా బిజెపి మాజీ ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్ రెడ్డి తదితరులు

మలక్ పేట ,అక్టోబర్ 7, ప్రభాతవార్త:
రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యక్రమం మలక్ పేట్‌లో ఘనంగా జరిగింది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ముసారాంబాగ్ లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ నాయకులు, కార్యకర్తలకు డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ బీజేపీ భాగ్యనగర్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్ రెడ్డి ల ఆధ్వర్యంలో పూలమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకులు మల్లికార్జున్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రతిభా పురస్కారాలను అందుకున్న ఫిన్ బధిర విద్యార్థులు

కేంద్ర మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలను అందుకుంటున్న ఫిన్ బధిర పాఠశాల విద్యార్థులు

మలక్ పేట, అక్టోబర్ 7, ప్రభాతవార్త:
మలక్ పేట లోని ఫిన్ బధిర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు సైగల భాషలో అత్యంత ప్రతిభను కనబరచడంతో కేంద్ర ప్రభుత్వ ప్రతిభా పురస్కారాలను అందుకున్నారు. కేంద్ర సామాజిక న్యాయ సాధికార శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ సైగల భాషా దినోత్సవ కార్యక్రమంలో సైగల భాషలో అత్యంత ప్రతిభ కనబరిచిన మలక్ పేట ఫిన్ బధిర ఆశ్రమ పాఠశాల బధిర విద్యార్థినీలు ధీరావత్ జయంతి, పత్లావత్ అనురాధలకు కేంద్ర సామాజిక న్యాయ సాధికార శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ ప్రతిభ పురస్కారాలు అందజేశారని ఫిన్ బదిరుల ఆశ్రమ పాఠశాల ప్రధాన కార్యదర్శి బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఫిన్ బధిర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం ప్రతిభా పురస్కారాలు అందుకోవడం పట్ల ఫిన్ డైరెక్టర్ జానకి హర్షం వ్యక్తం చేశారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ

తుర్కయంజాల్ అక్టోబర్7,ప్రభాతవార్త
తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఐదో మహాసభలు విజయవంతం కావాలని కాంక్షిస్తూ మున్సిపల్ కార్మికులు మరియు యూనియన్ నాయకులతో కలిసి తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ కె అమరేందర్ రెడ్డి గోడ పత్రికను తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం ముందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డి కిషన్ మాట్లాడుతూ అక్టోబర్ 14, 15వ తేదీల్లో తుర్కయంజాల్లో యూనియన్ రాష్ట్ర 5వ మహాసభలను నిర్వహిస్తున్నామని ఈ మహాసభల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల మీద కార్మిక హక్కుల మీద ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక విధానాల మీద రాష్ట్రవ్యాప్తంగా సుమారు 500 మంది ప్రతినిధులతో రెండు రోజుల పాటు మహాసభలు నిర్వహిస్తున్నామని రాబోయే రోజుల్లో కార్మిక వర్గ సంక్షేమ ధ్యేయంగా ఈ మహాసభల్లో చర్చించి వారి సమస్యల పరిష్కారం కోసం ముందుకెళ్లనున్నట్లు తెలిపారు ప్రధానంగా మున్సిపల్ కార్మికులకు



నెలకు 26 వేల రూపాయల కనీస వేతనంతో పాటు పర్మినెంట్, ఈఎస్ఐ పిఎఫ్ బోనస్ గ్రాట్యూటీ లాంటి చట్టబద్ధ సౌకర్యాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కార్మికుల వాటా తదితర సమస్యలను చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు శ్రీనివాస్, బాల్రాజ్ సిఐటియు నాయకులు ఏం సత్యనారాయణ ఎన్ యాదగిరి తల్లి కృష్ణ తుర్కయంజాల్ మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు మేతరి దాసు కార్మిక నాయకులు నవీన్, రవిచందర్, అర్జున్, మధు, అమర్, శీలం నగేష్, వెంకమ్మ, లక్ష్మీ, మాధవి, తదితరులు పాల్గొన్నారు

రూ.1 కోటి 20 లక్షలతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఉప్పల్, అక్టోబరు 7 ప్రభాతవార్త :
చిలుకానగర్ డివిజన్‌లో రూ.1 కోటి 20 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం డివిజన్ పరిధిలోని ఇందిరానగర్, సీతారామ కాలనీ, సాయిరాం నగర్ కాలనీ, రాఘవేంద్రనగర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో దశలవారీగా ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పనులు చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే డివిజన్‌లో అధికశాతం పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తి చేస్తున్నామని తెలిపారు. కార్పొరేటర్ బన్నాల గీత మాట్లాడుతూ డివిజన్ పరిధిలో గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. డివిజన్‌కు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, పలు కాలనీ సంఘాల నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

చిలుకానగర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ

ఉప్పల్, అక్టోబరు 7 ప్రభాతవార్త :
ఉప్పల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమర్థన్ ఫౌండేషన్ సహకారంతో రూ.లక్షా పదిహేను వేల ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో ప్రిన్సిపల్ డా.కె. విజయ్‌కుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీచేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ప్రైవేట్ స్కాలర్‌షిప్‌లు పొందడం అభినందనీయమన్నారు. స్కాలర్‌షిప్ సబ్జెక్టులలో పాసైన విద్యార్థులకు మాత్రమే మంజూరు చేశారని, మిగిలిన విద్యార్థులు కూడా అన్ని సబ్జెక్టులు, సెమిస్టర్లలో పాస్ అయితే చాలా స్వచ్ఛంద సేవా సంస్థలు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడానికి ముందుకు వస్తున్నాయని తెలిపారు. స్కాలర్‌షిప్ సమన్వయకర్త డాక్టర్ జి తిరుపతి మాట్లాడుతూ స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులు తల్లిదండ్రులు లేని వారిని, పేదవారిని, ప్రతి విద్యార్థికి ట్యూషన్ ఫీజు, ఎగ్జామినేషన్ ఫీజు, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.11,700 సమర్థన్ ఫౌండేషన్ సంస్థ అందజేసిందని తెలిపారు. ఈ సంవత్సరం మంజూరయ్యే స్కాలర్‌షిప్‌లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మెరిటేరియస్ విద్యార్థులకు సంస్థ సహకారం అందిస్తుందని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆధ్యాపకులు డా. సత్యనారాయణ, డా.రాజశ్రీ, విశ్వనాదజ్ కుమార్, గీత, విజయ్ కుమార్ డా. శ్రీనివాసరావు, డా.సాగర్ .అనుష, శ్రీలత, అరుణ, సూర్య తదితరులు పాల్గొన్నారు

ఉప్పల్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న ప్రిన్సిపల్ డా.విజయ్‌కుమార్ తదితరులు

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు : వజ్రేష్ యాదవ్

బోడుప్పల్ , అక్టోబర్ 7 ప్రభాతవార్త :
బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లో సోమవారం 18వ డివిజన్ లో నిర్మితమైన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం పూజా కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ , బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కార్పొరేషన్ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇళ్లను అందించిందని, ఈ పథకం ద్వారా లక్షలాది మంది పేద కుటుంబాలకు లబ్ధి కలిగిందని అన్నారు. ఈ సందర్భంగా లబ్దిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జి తోటకూర వజ్రష్ యాదవ్ కు జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్ శైలజ, సీనియర్ నాయకులు రాపోలు రాములు, బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బోడుప్పల్లో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారునికి అందజేసిన మేడ్చల్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ , మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ , పట్టణ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి తదితరులు

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో మహర్షి వాల్మీకి జయంతి

వాల్మీకికి నివాళులర్పించిన బడంగ్‌పేట్ కమీషనర్ సరస్వతి: చిత్రంలో పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు

సరూర్‌నగర్, అక్టోబర్ 7 ప్రభాతవార్త: రామాయణ గ్రంథాన్ని రచించిన భారతీయ మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని మంగళవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కమీషనర్ పి.సరస్వతి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ జాన్ కృపాకర్, డిఇఇ వెంకన్న, ఎఇ హరీష్, రెవెన్యూ ఆఫీసర్ వేణుగోపాల్‌రెడ్డి, మేనేజర్ స్వప్న, జెఎఓ అరుణ, పలువురు అధికారులు, వివిధ విభాగాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెంచిన ఆర్టీసి బస్సు ఛార్జీలను ఉపసంహరించాలి : శంకర్‌రెడ్డి

సరూర్‌నగర్, అక్టోబర్ 7 ప్రభాతవార్త: పెంచిన ఆర్టీసి బస్సు ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసి బస్సు ఛార్జీలను పెంచి ప్రజలపై ఆర్థిక భారం మోపిందని ఆయన విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఆర్టీసి బస్సు ఛార్జీలను పెంచడం దారుణమనీ అధికారంలోకి రాక ముందు ఒక విధంగా వచ్చిన తర్వాత మరో విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆయన అన్నారు. తక్షణమే ప్రజలపై మోపిన ఛార్జీల భారాన్ని వెనక్కి తీసుకోవాలని శంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

న్యూ తిరుమలనగర్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం

-రాఘవేందర్‌రెడ్డి

కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

సరూర్‌నగర్, అక్టోబర్ 7 ప్రభాతవార్త:
బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 26వ డివిజన్ న్యూ తిరుమలనగర్ కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి సహకరిస్తామని ఎఐసిసి తరుణ్ విభాగ్ తెలంగాణ కో-ఆర్డినేటర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, స్థానికులతో కలిసి కాలనీలో సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో రోడ్లు, డ్రైనేజీలకు సంబంధించిన పెండింగ్ పనులు పూర్తి చేయించి సమస్యలు లేకుండా చేస్తామని తెలిపారు. సమస్యలను కమీషనర్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం అయ్యే విధంగా చూస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు యాదయ్య, శివాజీ, శివరాంరెడ్డి, ఈదయ్య, నారాయణ, ఇస్మాయిల్, మధు, రవి, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థ ఎన్నికలలో బిసి రిజర్వేషన్లలో ఎబిసిడి వర్గీకరణ చేయాలి

తుర్కయంజాల్ అక్టోబర్7 ప్రభాతవార్త
తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో రాగన్నగూడలో వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశాన్నికి ముఖ్య అతిథిగా వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విఘ్నేశ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ లలో ఎ, బి, సి, డి వర్గీకరణ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వడ్డెర వృత్తిదారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరారు. వడ్డెర వృత్తిదారులకు లోన్లు, ప్రమాద భీమా కల్పించాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు దాటిన వడ్డెర వృత్తిదారులకు ఫింఛన్లు మంజూరు చేయాలని అన్నారు. వడ్డెర వృత్తిదారులకు 5కోట్లు వరకు ఎలాంటి ఇఎండి లేకుండా కాంటాక్ట్ పనులలో 30 శాతం పనులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్వార్వీలపై, గుట్టలపై పూర్తిహక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కుంచం వెంకటకృష్ణ, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ దేరంగుల రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇరుగదిండ్ల కురుమయ్య, నాయకులు దేరంగుల బాలకృష్ణ, యాదగిరి, తన్నీరు సైమన్, ముద్దంగుల చిన్నయ్య, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి నర్సింహకు ఘన నివాళి

ధర్పల్లి నర్సింహకు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

హుడా కాంప్లెక్స్, అక్టోబర్ 7, ప్రభాతవార్త:
కీర్తిశేషులు మాజీ సర్పంచ్ మరియు ఎల్బీనగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ కీర్తిశేషులు ధర్పల్లి నరసింహన్న (పైల్వాన్) వర్ధంతి సందర్భంగా సరూర్ నగర్ లో ఘనంగా వవర్ధంతి వేడుకలు నిర్వహించారు. సరూర్ నగర్ బస్ స్టేషన్ కూడలిలోనీ ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి సుభాష్, ధర్పల్లి అశోక్, ధర్పల్లి రవి, ధర్పల్లి మహేంద్ర, ధర్పల్లి రాజు, మహేందర్ యాదవ్, గండు ధనం రెడ్డి, బాలరెడ్డి, శ్రీనివాస్ రావు, సాయికిరణ, గోవర్ధన్ రెడ్డి సరూర్ నగర్ పెద్దలు నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.

అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న : ఉప్పల

అన్న ప్రసాదం అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్త దంపతులు

ఎల్.బి.నగర్, అక్టోబర్ 7 ప్రభాతవార్త:
న్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని టీపిసిసి ప్రధాన కార్యదర్శి ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మహిళ విభాగం ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా కొత్తపేట కరెంట్ ఆఫీస్ వద్ద నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శ్రీనివాస్ గుప్తా హాజరై ప్రజలకుఅన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కన్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో పబ్బ చంద్రశేఖర్ గుప్త, ఐవిఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, మహిళ విభాగ్ రాష్ట్ర ప్రెసిడెంట్ చందా భాగ్యలక్ష్మి, మానిమాల, పద్మ, పద్మజ, గోలి సరిత, పోలా అర్చన, కావ్య, చందా సుధాకర్, సామా జగన్నాథం, సునీత, భార్గవి, దాక్షాయిని తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ దేవాలయం కమిటీ ఏకగ్రీవం

కార్యక్రమంలో పాల్గొన్న బద్ధం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, అక్టోబర్ 7 ప్రభాతవార్త: గడ్డిఅన్నారం డివిజన్ కోదండరాంనగర్ శ్రీపోచమ్మ దేవాలయం కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కమిటీని కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అభినందించారు. కమిటీ సబ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కార్పొరేటర్ ను కలిశారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం పెద్దలు పెద్ది తిరుపతి, బైరా యెల్లయ్య, కర్నాల విజయ్ కుమార్, కుకట్ల బీరప్పా, యాద శంకర్, కర్నాల రాజయ్య, సంపత్, ముత్తా శివ, శ్రీపోచమ్మ దేవాలయం నూతన కమిటీ చైర్మన్ చిగుర్ల ఆంజనేయులు, వైస్ చైర్మన్ వట్టే రాజు, ప్రధాన కార్యదర్శి బొప్పెనపెల్లి యాదగిరి, జాయింట్ సెక్రటరీ చెంచు రాజు, కోశాధికారి మేకల రాజు తదితరులు పాల్గొన్నారు.

నాగోల్ డోబీఘాట్ లో పెండింగ్ సమస్య పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మల్కాజ్గిరి పార్లమెంటు సబ్యులు ఈటల రాజేందర్‌కు నాగోల్ రజక సంఘం ప్రతినిధులు వినతి పత్రాన్ని అందజేశారు. అందుకు స్పందించిన ఈటెల వెంటనే సంబంధిత అధికారులకు లేక ఇచ్చి వెంటనే ఆసంపుర్తిగా వున్న మౌళికవసతుల పనులు పూర్తివేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలోనాగోల్ రజక సంఘం నాయకులు బి.చుక్కయ్య, బి.కృష్ణ, బి.మధు, బి.మహేందర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

శ్రీనివాస్‌కు మొక్క అందజేస్తున్న పవన్‌కుమార్

ఎల్.బి.నగర్, అక్టోబర్ 7 ప్రభాతవార్త:
డివిజన్ పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం సరూర్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బువనగిరి శ్రీనివాసరావుని కలిసి పలు సమస్యలను వివరించారు. ఒక పూల మొక్కను కూడా శ్రీనివాస్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ఉన్న ప్రజా సమస్యలు, కాలువలు, రహదారులు, వీధిదీపాలు, పారిశుద్ధ్య తదితర సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిఈ చందన, సానిటరీ సూపర్వైజర్ బుచ్చయ్య, జిహెచ్ఎంసి జవాన్లు, సూపర్వైజర్లు, రామ్ కి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానం

- ఎక్సైజ్ సిఐ ఓంకార్

ఉప్పల్, అక్టోబరు 7 ప్రభాతవార్త :
ఉప్పల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యం దుకాణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఉప్పల్ ఎక్సైజ్ సిఐ ఓంకార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సిఐ ఓంకార్ మాట్లాడుతూ ఈ ఏడాది డిసెంబర్ 1 నుంచి 30 నవంబరు 2027 వరకు లైసెన్స్ ఉంటుందని తెలిపారు. 21 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న దరఖాస్తుదారులు రూ.3లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు దాఖలు చేసేందుకు అక్టోబరు 18వ తేది వరకు గడువు ఉందని, దరఖాస్తుదారులు జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని తెలిపారు. రాష్ట్రంలోని ఏ మద్యం దుకాణానికైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

మీర్‌పేట్‌లో ఘనంగా వాల్మీకి జయంతి

వాల్మీకి జయంతిని నిర్వహించిన మీర్‌పేట్ కమిషనర్ నాగమణి: చిత్రంలో అసిస్టెంట్ కమీషనర్ సంరెడ్డి నాగేందర్‌రెడ్డి